క్లుప్తంగా

చర్లలో గాలి దుమారం

చర్ల: చర్ల మండలంలో మంగళవారం రాత్రి గాలి దుమారం రావడంతో పాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలగొరగడంతో పాటు విద్యుత్ తీగలపై పడడంతో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. గాలి దుమారానికి తోడు భారీగా వర్షం కూడా కురిసింది. దీంతో మండలంలోని చర్ల, సత్యనారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది. మంగళవారం రాత్రి 9.00 గంటల ప్రాంతంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా గాలి దుమారానికి తోడు భారీగా వర్షం కురవడంతో వరి, మిర్చి పంటలు తడిసి ముద్దయ్యాయి. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో పలు గ్రామాల్లో కళ్లల్లో ఆరబోసిన పంటలు తడిసి నీటిపాలయ్యాయి.

నర్సింగ్ వృత్తిని బాధ్యతతో నిర్వర్తించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో మంగళవారం థ్యాంక్స్ గివింగ్–ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, అంకిత భావం, బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. అనంతరం మారుతి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు మాట్లాడుతూ.. క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా 45 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. అన్నారు. కార్యక్రమంలో వైద్యులు బి.సుబ్బరాజు, ఎస్ఎన్వీ రామారావు, ఎంవీ కోటిరెడ్డి, పుల్లయ్య, డాక్టర్ చైతన్య, సంతోష్, పి.రాజశేఖర్ తో పాటు టి. సిద్దులు, సీతారావిఎరెడ్డి, గోళ్ల భూపతిరావు, చావా లక్ష్మీనారాయణ, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని పోలీసులకు మంగళవారం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు స్థానిక గుప్తా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలోని 150 మంది పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొనగా.. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ కూడా కంటి పరిక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు సంతోష్ కుమార్, మూడు మండలాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చండ్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామంలో గానుగపాడు సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ చందర్‌రావు, సీఈఓ లంకా నర్సింహారావు, ఉన్నం నాగరాజు, పసుపులేటి వెంకటేశ్వర్లు, సత్తి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత బాలికల పాఠశాలకు లైబ్రరీ బుక్స్‌తో పాటు బీరువాను ఐటీసీ బీఎమ్ఎస్ బృందం మంగళవారం వితరణగా అందజేశారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం సుమారు రూ.25 వేల విలువ ఉన్న పుస్తకాలను హెచ్ఎమ్ రమకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశ పుస్తకాలతో పాటు లైబ్రరీలోని పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్ఈఓ టి.రమ, చెంగల్‌రావు, దివ్య, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబీకులకు మృతదేహం అప్పగింత

అశ్వారావుపేటరూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం పొందే క్రమంలో మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని కుటుంబీలకులను గుర్తించి మంగళవారం వారికి పోలీసులు అప్పగించారు. ఏఎస్సై యాఖుబ్ అలీ కథనం ప్రకారం.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అవరణలో తీవ్ర అస్వస్థతకు గురై కిం పడిపోయి ఉన్న వృద్ధుడిని స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్యం అందించే క్రమంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ వృద్ధుడి పూర్తి వివరాలు తెలియకపోవడంతో ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్ర పరిచారు. వృద్ధుడి మృతి విషయం పలు పత్రికల్లో రాగా.. కుటుంబీకులు గుర్తించి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. మృతుడి వివరాలు, ఆధారాలు సమర్పించగా ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఊటసముద్రం గ్రామానికి చెందిన జుంజునూరి వెంకటేష్(60)గా గుర్తించారు. తన కుటుంబీకులతో ఈ నెల 3వ తేదీన గొడవపడి, బయటకు రాగా తిరిగి ఇంటికి వెళ్లలేదని ఏఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

- వాల్‌పోస్టర్లు, కరపత్రాలతో విస్తృత ప్రచారం
- కొనసాగుతున్న అగ్నిప్రమాదాల వారోత్సవాలు



మణుగూరుటౌన్: పోస్టర్లు, కరపత్రాలతో స్థానికులు, అగ్ని మాపక సిబ్బంది



భద్రాచలంఅర్బన్: అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

మణుగూరుటౌన్: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మంటలు ఎగసిపడిన సమయంలో దూరంగా వెళ్లిపోవాలని అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. మంగళవారం అగ్ని ప్రమాదాల వారోత్సవాల్లో భాగంగా వాసవీ సురక్షా బస్టాండ్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు అధిక సంచారం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించే పోస్టర్లు అంటించారు. విస్తృతంగా కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది విష్ణు, గోవర్ధన్, వీరాస్వామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పినపాక: ప్రజలందరూ అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని, సమయానుసారం ప్రమాదాలను నియంత్రించాలని అగ్నిమాపక అధికారి వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని ఈ బయ్యారం గ్రామంలో అగ్నిమాపక ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి..

భద్రాచలంఅర్బన్: అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన వారోత్సవాలలో భాగంగా మంగళవారం భద్రాచలం ఆర్టీసీ డిపోలో సిబ్బంది అగ్నిప్రమాదాలపై స్థానిక అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో అందుబాటులో ఉన్న సిబ్బంది స్పందించాల్సిన తీరును వివరించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు సిబ్బందికి అందజేశారు.

17శాతం తేమ వచ్చేలా ఆరబెట్టాలి

మణుగూరుటౌన్: ధాన్యాన్ని 17శాతం తేమ వచ్చేలా ఆరబెట్టాలని, ఆరిన తర్వాత చెత్త తాలు 1శాతం, పక్వంకాని గింజలు 1శాతం, ఇతర రకం 5శాతం మించకుండా ఉండేలా చూడాలని వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణరావు రైతులకు సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఇబ్బంది పడకుండా తాగునీరు, టెంటులు, ధాన్యంపై కప్పడానికి పట్టాలు ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు బత్తుల శ్రీనివాసరావు, ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న విస్తరణ అధికారి లక్ష్మణరావు

ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ కుటుంబానికి బూర్గంపాడు ఎస్‌బీఐలో రూ.20లక్షల బీమా చెక్కును మంగళవారం అందజేశారు. గత ఏడాది అక్టోబర్‌లో సారపాక ప్రధాన కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదరాయిగూడెం గ్రామానికి చెందిన నడిపింటి సరిత అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాద బీమాలో భాగంగా బూర్గంపాడులోని ఎస్‌బీఐ మేనేజర్ ప్రద్యుమ్న, ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ మురళీధర్‌రావులు మృతురాలి భర్త వినోద్‌కుమార్‌కు రూ.20లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తునికాకు సేకరణ ప్రారంభించాలి



ములకలపల్లి: డీటీ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ములకలపల్లి: ఏజన్సీ ప్రజల వేసవి పంట తునికాకు సేకరణ వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూపా భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ములకలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. యాభై ఆకుల కట్టకు రూ.5 ఇవ్వాలని, పెండింగ్ బోనస్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. పార్టీ జిల్లాకమిటీ సభ్యుడు కల్లూరి కిషోర్, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, .ఇల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్, యర్రగొర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: అటవీ ప్రాంతంలో నివసించే గిరిజనులకు యాసంగిలో ప్రధాన ఉపాధి అయిన తునికాకు సేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు తొడెం దుర్గమ్మ, కుర్సం ముత్యాలరావు, పండూరి వీరబాబు, కాకా వెంకటేష్, తెల్లం నాగేష్, తాటి సత్యం, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ డీఈగా విశ్వనాథ్



ములకలపల్లి: ములకలపల్లి ఆర్అండ్‌బీ డీఈగా జే.విశ్వనాథ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. వైరాలో ఆర్అండ్‌బీ ఏఈగా విధులు నిర్వహించిన విశ్వనాథ్, పదోన్నతిపై ములకలపల్లికి వచ్చారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తాం..

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన అందిస్తామని అశ్వారావుపేట జెడ్పీఎస్‌హెచ్ హెచ్ఎం పి.హరిత అన్నారు. మంగళవారం అశ్వారావుపేట, నారంవారిగూడెంతోపాటు పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ముందుగా ముందస్తు బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే సౌకర్యాలు, బోధన తీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారావు, కిషోర్, కట్టా శ్రీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ చెల్లించాలి

భద్రాచలంటౌన్: కాంట్రాక్టు ప్రాతిపధికన తాజాగా నియమితులైన డీఎస్సీ–2008 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బుటారి రాజు అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రెజరీ సైట్‌లో ఉపాధ్యాయుడి పేరు, ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో అనుసంధానం చేసి డ్రాయింగ్ ఆఫీసర్లు వారికి రెమ్యునరేషన్ ట్రెజరీ ఫార్మ్ 58లో బిల్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యుడు మునిగడప రామాచారి, రాష్ట్ర కౌన్సిలర్ కెచ్చల మాధవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పోలేబోయిన గంగరాజు, సనప కృష్ణబాబు, సరియా, హనుమంతు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కరకగూడెం: అడవులను కాపాడుకుంటూ వన్య ప్రాణులను వేటాడా కుండా రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అనంతారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గోవింద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలైన అశ్వాపురం పాడ్, నీలాద్రిపేటలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల నరికివేతకు ఎవరైనా పాల్పడిన, వన్యప్రాణులను వేటాడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో పలువురు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీని ఖాళీ చేయండి

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామశివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్వహిస్తున్న ఇటుకబట్టిని ఖాళీ చేయాలని తహసీల్దార్ సంధ్యారాణి ఆదేశించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో ఇటుక బట్టి ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని ఆమె మంగళవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ భూమిని ఖాళీ చేయాలని ఆమె ఆక్రమణదారులకు సూచించారు. ఆమె వెంట ఆర్ఐ అక్బర్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బట్టీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి

ప్రమాణ స్వీకారం

మణుగూరుటౌన్: బార్, బెంచ్ స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ అడ్వకేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని 2025–26 నూతన మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కోర్టు ఆవరణలో జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డిల సమక్షంలో జరగ్గా.. జ్యోతి ప్రజ్వలన అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు నూతన కమిటీకి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, అడ్వకేట్లు రమణారెడ్డి, చిర్రా రవి కుమార్, దాసరి కవిత, చిర్ర సరస్వతి, వీరమధుసూదన్, రామ్మోహన్‌రావు, బొమ్మరామకొటయ్య, శైలజ, వాసవీ, రత్నకుమార్, రుద్ర వెంకట్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం దుస్తులను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో టైలర్లకు దుస్తులు అందించారు. కాంప్లెక్స్ హెచ్ఎం ఏ.వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ జ్యోతి, చల్లా భాస్కర్ పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంజూరైన యూనిఫాం క్లాత్‌ను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ గద్దె రేవతి, ఏపీఎం సంపత్‌కుమార్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం



దుమ్ముగూడెం: రామారావుపేటలో ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేట గ్రామంలో గాలివానకు ఇళ్లు ధ్వంసం అయిన కాంగ్రెస్ కార్యకర్తలు కారం గోపాల్, కారం కామయ్యలకు పీవీ చారిటబుల్ ట్రస్ట్ (విజయవాడ) సహకారంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నటరాజస్వామి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు సిద్ధి ప్రవీణ్, బుర్రి లావణ్య, డింగి సందీప్ రెడ్డి, వర్షా గౌరయ్య, ఆళ్ల వెంకటకృష్ణ, వర్షా ప్రసాద్, మారెళ్ళ నవీన్, కారం వీరస్వామి, కారం వేణు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు..

మండలంలోని పిరాయిగూడెంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు చర్ల ఏటీపీ ఆధ్వర్యంలో రూ.11,500 నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏటీపీ రాష్ట్ర కార్యదర్శి సవలం వీరాస్వామి, మండల అధ్యక్షులు శ్యామల రామారావు, ప్రధాన కార్యదర్శి తోకల లక్ష్మీపతి, ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లురు, ఆదివాసీ మహిళ నాయకురాలు దేశ ధనలక్ష్మి, మొడెం వరలక్ష్మి, పాయల సుగుణ, మండల గౌరవ అధ్యక్షులు సోయం శేషు, మెండి రాజకుమార్, కోర్స రాజబాబు, సోయం శ్యామ్ కుమార్, పరిష్క రాజు, పొడియం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి బాధితులకు..

భద్రాచలంటౌన్: భద్రాచలంలో కేన్సర్, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పలువురు బాధితులకు ఆర్థిక సహాయాన్ని వసుధ ఫౌండేషన్ అధ్వర్యంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మంగళవారం తన చాంబర్‌లో అందజేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఎస్‌కే జహర్బీ, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వీరయ్యలకు వైద్య చికిత్స కోసం ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున చెక్కులను అందించారు. వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, వారి బృందం అందిస్తున్న సేవలను ఏఎస్పీ ఈ సందర్భంగా అభినందనీమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, ఎస్‌కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయాలి



రహదారిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: భద్రాచలం, చర్ల వరకు ప్రధాన రహదారికి వెంటనే మరమ్మతు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని బుర్ర వేముల–గంగోలు మధ్య దెబ్బతిన్న ప్రధాన రహదారిని పార్టీ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించగా.. వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మచారి, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను బాబు పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి వితరణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని దురదపాడు పంచాయతీ పాలగుంపు గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు మంగళవారం వితరణ అందించారు. మొద్దులమడ గ్రామానికి చెందిన చిప్పల బాబురెడ్డి, దురదపాడు గ్రామానికి చెందిన పండా రాజు కలిసి బాధిత నాలుగు కుటుంబాలకు రూ.15వేల విలువైన వంట గిన్నెలు, స్టీల్ బిందెలు, బకెట్లు, దుస్తువులు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు.

ఆదివాసీ కుటుంబానికి బియ్యం..

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధర్మన్ననగర్ వాసి, వలస ఆదివాసీ పొడియం దినేష్ కుటుంబానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బియ్యం వితరణగా అందజేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ చేతుల మీదుగా 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ సీతారాంపురం జీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎండీ. అంజుం, గుర్రం కృష్ణమూర్తి, కుంజా రవి, పత్తిలాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: బీఆర్ఎస్ అనుబంధ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నూతన కమిటీని మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా గడదేసి మధుబాబు, కార్యదర్శి మాదేవి అశోక్, ఉపాధ్యక్షుడిగా గాజుల నాగరాజు, కోశాధికారిగా ఎర్రోజు రాములతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభకు కదలాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ నుంచి వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా పార్టీ శ్రేణులు కదిలిరావాలని నియోజకవర్గ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానె రామకృష్ణ, రేపాక పూర్ణచంద్రరావు, జయప్రేమ కుమార్, కాపుల సూరిబాబు, డానియల్ ప్రదీప్, గుంజ ఏడుకొండలు, బద్ది బాబి, మోహన్ రావు, రావూరి రవి కిరణ్, జక్కం గోపి, ఇమంది నాగేశ్వరరావు, పసుపులేటి రమేష్, పూజల లక్ష్మి, ఏలూరి ప్రియాంక, తెల్లం రాణి, సలోమి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం క్రాస్ రోడ్డులో ఉన్న బీఆర్ఎస్ కోకన్వీనర్ ఎండి.జానీపాషా ఇంటి వద్ద ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ 25వ వార్షికోత్సవ సభ సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ హాజరై మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, సొసైటీ డైరెక్టర్లు బొల్లి వెంకట్రావు, కాల్వ పూర్ణయ్య, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు కొత్తూరు సీతారామారావు, కొత్త మల్లేష్, దామెర్ల శ్రీనివాసరావు, నోముల రామిరెడ్డి, వాగే కిట్టు, కృష్ణబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలుసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ స్పందన

అశ్వారావుపేటరూరల్: దేశం గర్వించదగ్గ మహానుభావుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్క విద్యార్థీ తెలుసుకోవాలని మండల పరిధిలోని పెదవాగు ప్రాజెక్టులో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (దమ్మపేట) ప్రిన్సిపాల్ వి.స్పందన సూచించారు. మంగళవారం ఈ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డీవీ.శంకర్‌రావును భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ మంగళవారం అభినందించారు. ఖమ్మం పట్టణంలో జరిగిన ఉమ్మడి జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో జిల్లాకు మాస్టర్ టీం ఛాంపియన్‌షిప్‌ను శంకర్‌రావు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని, వైద్యుల పర్యవేక్షణలో మాస్టర్ 4 విభాగంలో 83వ కేటగిరీలో 60 కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించిన శంకర్రావు క్రీడా స్ఫూర్తిని ఎమ్మెల్యే కొనియాడారు. రామిరెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ వంశీ పాల్గొన్నారు.